# చెరువుల సర్వే వేగవంతం చేయాలి

- 558 చెరువులపై సర్వే నిర్వహించాలి
- అదనపు కలెక్టర్ నగేశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆదనపు కలెక్టర్ నగేష్, పాల్గొన్న అధికారులు

మెదక్, (నమస్తే తెలంగాణ)/ మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 29 : జిల్లాలో హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని తూప్రాన్, మనోహరాబాద్, నర్సాపూర్, శివ్వంపేట మండలాల పరిధిలో చెరువుల సర్వే వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ నగేశ్ ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ చెరువుల సర్వే నిర్వహణపై ఏడీ సర్వే శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు సంబంధిత తహసీల్దారులు, సర్వేయర్లతో అదనపు కలెక్టర్ నగేశ్ సమీక్షించారు. నాలుగు మండలాల్లో 538 చెరువుల సర్వే నిర్వహణపై సమీక్షించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారులు, ఇరిగేషన్ ఏఈలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## వయోజన విద్యకు ఉల్లాస్‌తో ఊతం

ఉల్లాస్‌తో వయోజన విద్యకు ఊతం లభిస్తుందని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యాలపై ఆధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమంల ద్వారా నిరక్ష్యరాసులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని సాధించడానికి చర్యలు తీసుకునేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా, మండల స్థాయి మహిళా సంఘాల ద్వారా నిరక్ష్యరాసుల వివరాలను ఉల్లాస్ యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. పదో తరగతి పూర్తి చేయని వారిని గుర్తించి ఓపెన్ పరీక్షలు రాయించి, ఉత్తీర్ణత అయ్యేలా చూడాలన్నారు. అక్షరాస్యత శాతం తక్కువగా గల మండలాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశంలో డీఈవో రాధాకిషన్, పీడీ డీఆర్డీఏ శ్రీనివాస్‌రావు అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నగేశ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రోడ్డు భద్రత జిల్లాస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత అత్యంత ప్రాధాన్యమైనదని, మానవ తప్పిదాలతో జరుగుతున్న ప్రమాదాల్లో 18 నుంచి 45 ఏండ్ల లోపు వారే ఎక్కువగా మృతి చెందుతున్నారన్నారు. జిల్లాలోని జాతీయ రహదారి 161, 44, 165డీ, 765డీజీపై పోలీసు శాఖ గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద రేడియం స్టిక్కర్లతో కూడిన సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ సర్దార్ సింగ్, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, నేషనల్ హైవే కన్సలెంట్లు, కాంట్రాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

## నీట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

మే 4న జరగనున్న నీట్ పరీక్షకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యేలా చూడాలని అదనపు కలెక్టర్ నగేశ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నీట్ పరీక్ష సెంటర్ కేటాయించామని, 487 మంది పరీక్షకు హాజరవుతారని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నీట్ పరీక్ష జరుగుతుందన్నారు. సమావేశంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, యూజీ సీ–నీట్ సిటీ కోఆర్డినేటర్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ హుస్సేన్, డీఈవో రాధాకిషన్, డీఎస్పీ ప్రసన్నకుమార్ హాజరయ్యారు.

# సకాలంలో డబ్బులు వచ్చేలా సహకరించాలి



నర్సాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రైతు రక్షణ సమితి ముఖ్య సలహాదారుడు చంద్రశేఖర్



చేగుంట: కర్నాల్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి



చిన్నశంకరంపేట: ఎస్.కొండాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ మన్నన్

చేగుంట, ఏప్రిల్ 29: ధాన్యం డబ్బులు సకాలంలో అందేలా సహకరించాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కర్నాల్‌పల్లి, చిన్నశివునూర్ తదితర గ్రామాల్లో ఆర్డీవో మంగళవారం సందర్శించారు. రిజిస్టర్లు, పంట సేకరణ విధానం, నాణ్యతా పరీక్షలు, చెల్లింపు ప్రకియలను పరిశీలించారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా కృషి చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ జయభారత్‌రెడ్డి, ఏపీఎం లక్ష్మీనర్సమ్మ ఉన్నారు.

## రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలి

చేగుంట, ఏప్రిల్ 29: రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చూడాలని మడూర్ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నార్సింగి మండలంలోని శేరిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెప్యాల మల్లేశం, జమాల్‌పూర్ రమేశ్, సీఈవో కృష్ణ, నాయకులు గోవర్ధన్, గోండ స్వామి, రమేశ్, కందరి శ్రీనివాస్, ఇండ్ల శ్రీనివాస్, లక్ష్మీనర్సింహులు పాల్గొన్నారు.

## దళారులకు విక్రయించి మోసపోవద్దు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 29: ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని తహసీల్దార్ మన్నన్ సూచించారు. ఎస్ కొండపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం లక్ష్మీనారాయణ , రాజు, రైతులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 29: కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ మన్నన్ తెలిపారు. ధాన్యాన్ని వాయుపుత్ర రైస్‌మిల్‌కు పంపగా, అక్కడికి వెళ్లి మిల్లులో ధాన్యాన్ని పరిశీలించారు. గన్నీ బస్తాలు ఐకేపీ నుంచి పొందాలని, అక్కడి నిర్వాహకులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాల బాధ్యత నిర్వాహకులదేనని ఆమె ఆదేశించారు.

## రైతులు దళారీలను నమ్మి మోసపోతున్నారు

నర్సాపూర్, ఏప్రిల్ 29: అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించక దళారులను ఆశ్రయించి రైతులు మోసపోతున్నారని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా ముఖ్య సలహాదారుడు చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రాష్ట్ర రైతు రక్షణ సమితి జిల్లా ముఖ్య సలహాదారుడు చంద్రశేఖర్ మాట్లాడారు. నర్సాపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆలస్యంగా ప్రారంభించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం రూ.2300లకు మద్దతు ధర ప్రకటించి కొంటుంటే దళారులు క్వింటాల్‌కు 2100 చెల్లించి రైతులను మోసం చేస్తున్నారన్నారు. వడగండ్ల వర్షానికి రైతులు నష్టపోయారన్నారు. ప్రభుత్వం దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# అంగన్‌వాడీ కార్యకర్తల ముందస్తు అరెస్ట్



నిజాంపేటలో..



పాపన్నపేటలో..

నిజాంపేట, ఏప్రిల్ 29: సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌కు వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను నిజాంపేట పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రామలక్ష్మి, దుర్గేశ్వరి, వీణ, రేణుక, అరుణశ్రీ, మణెమ్మ తదితరులున్నారు.

**పాపన్నపేటలో..**

పాపన్నపేట,ఏప్రిల్ 29ః ములుగు జిల్లాలో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి తరలి వెళ్లకుండా మంగళవారం అంగన్‌వాడీ టీచర్లను పాపన్నపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.ఈ సందర్భంగా అంగన్ వాడీ టీచర్లు అనురాధ,బసమ్మ,యాదవేణి, లలిత,శోభారాణి,పారుబాయి విలేకర్లతో మాట్లాడుతూ తమ వేతనాలు పెంచి,న్యాయమైన తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు.అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.




అధికారుల ఎదుట ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గోమారం గ్రామస్తులు

# అవకతవకలపై అధికారుల ఎదుటే ఆగ్రహం

శివ్వంపేట, ఏప్రిల్ 29: ఎంపీపీ కార్యాలయంలో ఉపాధి పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. అధికారులు సామాజిక తనిఖీలు చేస్తున్న సమయంలో గోమారం గ్రామానికి చెందిన పలువురు ఫీల్డ్ అసిస్టెంట్, టీఏలు పనులు చేయకున్నా చేసినట్టు చూపి, దాదాపు 13లక్షలు అవకతవకలు జరిగాయని అధికారుల ముందు గ్రామస్తులు మండిపడ్డారు. కూలీలతో పనులు చేయించకుండా చెట్లు యంత్రాలతో పనులు చేసి కూలీల పేర్ల మీద డబ్బులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోకపోతే కలెక్టర్‌కు, ఈజీఎస్ కమీషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా అడిషనల్ గ్రామీణాభివృద్ధి అధికారి రంగాచార్యులు, విజిలెన్స్ అధికారి శ్రీహరి, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి సంపత్‌కుమార్‌ఆర్యా, సీనియర్ క్వాలిటి కంట్రోల్ అధికారులు జ్యోతి, అరుణ, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఎంపీడీవో నాగేశ్వర్, ఏపీఓ అనీల్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి ఉన్నారు.

# ఈఎస్ఐ డిస్పెన్సరీ నూతన భవనం పరిశీలన



నూతన భవనాన్ని పరిశీలిస్తున్న తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి

తూప్రాన్, ఏప్రిల్ 29: మున్సిపాలిటీలోని పోతరాజ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా అద్దె భవనంలో కొనసాగుతున్న ఈఎస్ఐ డిస్పెన్సరీ అద్దె చెల్లింపు విషయంలో భవన యజమానికి, దవాఖాన యాజమాన్యానికి కొన్ని రోజులుగా విబేధాలు నెలకొన్నాయి. దీంతో నెలకోసారి, రెండు నెలలకోసారి భవన యజమాని ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం వేసుకోవడం, దీంతో సిబ్బంది బయటే వేచి చూసి వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. దీంతో దవాఖానకు వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీ తరచూ మూస్తూ తెరుస్తూ ఉండటంపై తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఈఎస్ఐ డిస్పెన్సరీ నూతన భవనం కోసం మంగళవారం ఆర్డీవో పోతరాజ్ పల్లి కమాన్ వద్ద 2128 చదరపు అడుగుల భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఈఎస్ఐ డిస్పెన్సరీ డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

# హైదరాబాద్ వాసికి దక్కిన మెదక్ బార్




లాటరీ ద్వారా ఎంపికైన నంబర్‌ను చూపుతున్న అదనపు కలెక్టర్

మెదక్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): మెదక్ బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణకు లాటరీ ద్వారా ఎంపిక చేసినట్లు అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు. పట్టణంలో మూడేండ్లుగా మూతబడిన బార్ అండ్ రెస్టారెంట్‌కు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో మంగళవారం లాటరీ ప్రక్రియ నిర్వహించారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి దరఖాస్తుదారులకు సూచనలు, సలహాలు, నియమ నిబంధనలు వివరించారు. అనంతరం లాటరీ తీసి, హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన శోభను విజేతగా ప్రకటించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐలు నాగేశ్వరరావు, గోపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం



రామకృష్ణ (ఫైల్)

రామాయంపేట, ఏప్రిల్ 29: పట్టణానికి చెందిన డాకి రామకృష్ణ ఈనెల 21న ఇంట్లో నుంచి నిజామాబాద్ వెళ్తున్నాని అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు రామకృష్ణ ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీశారు. ఎక్కడ కూడా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం రాత్రి రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై.బాలరాజు తెలిపారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

రామాయంపేట, ఏప్రిల్ 29: రైతులకు కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తాయని రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, తహసీల్దార్ రజినీకుమారి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రామాయంపేట, నిజాంపేట రెండు మండలాలకు చెందిన రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ప్రతి గింజ కూడా ఎక్కడా పోకుండా పీఏసీఎస్ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయాలు జరుపాలన్నారు. కార్యక్రమంలో సుప్రభాతరావు, రమేశ్‌రెడ్డి, సరాఫ్ యాదగిరి వెంకటి, సీఈవో నర్సింహులు, ఐలయ్య, లద్ద నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఆలయంలో మాజీ మంత్రి పూజలు



మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ ఆకుల మల్లేశంగౌడ్

చేగుంట, ఏప్రిల్ 29: నార్సింగిలోని ఎల్లమ్మ ఆలయంలో ఎక్సైజ్ శాఖ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. వైస్ ఎంపీపీ ఆకుల మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రికి ఆలయ కమిటీ సభ్యులు గీతా కార్మికులు సిద్ధగౌడ్, సత్తగౌడ్, యాదగౌడ్, ప్రవీణ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, నవీన్‌గౌడ్, రాజుగౌడ్ సన్మానించారు.

## గురుకులంలో దరఖాస్తుల ఆహ్వానం



సంధ్యారాణి

తూప్రాన్, ఏప్రిల్ 29: 10వ తరగతి పూర్తయి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహాత్మా జ్యోతిభా పూలే బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి తెలిపారు. రావెల్లి గురుకుల బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మే 12 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

మెదక్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): పది నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సందిల బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఏడాదిన్నర కాలం నుంచి గ్రామాల్లో సర్పంచులు లేకపోయినా పంచాయతీ కార్యదర్శులు అన్నీ తామై నడిపిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నారన్నారు. పంచాయతీలకు ఎలాంటి నిధులు విడుదల చేయకపోయినా ప్రజలకు తాగునీటికీ ఇబ్బందులు రాకుండా చూస్తున్నట్లు తెలిపారు. పెండింగ్ బిల్లులు విడుదల కాకపోతే పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలు భవిష్యత్తులో ఆర్థికంగా చితికిపోయే ప్రమాదం ఉన్నదన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

రామాయంపేట, ఏప్రిల్ 29: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాయిలాపూర్‌లో కొన్నిరోజులుగా భూమగారి బాబాగౌడ్, గట్టు ఇసాక్ అక్రమంగా మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరు వారి ఇండ్లపై దాడిచేసి, మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## కార్మికులకు ఇండ్లు మంజూరు చేయాలి

రామాయంపేట, ఏప్రిల్ 29: ప్రభుత్వాలు కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అయ్యవారి లక్ష్మణ్, హమాలీ, తాపీ మేస్త్రీల సంఘం కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం మేడే కరపత్రాలను ఆవిష్కరించారు. హమాలీలకు పనికి తగిన కూలి ఇవ్వాలన్నారు. 56 ఏండ్లు దాటిన వారికి రూ.6వేల పింఛన్ ఇవ్వాలన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వే



లబ్ధిదారుల సర్వే చేస్తున్న ఎంపీడీవో విఘ్నేశ్వర్

వెల్దుర్తి, ఏప్రిల్ 29: ప్రభుత్వం మంజూరు చేయనున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పర్యటించి గుర్తించనున్నట్లు మాసాయిపేట ఎంపీడీవో విఘ్నేశ్వర్ అన్నారు. మంగళవారం మాసాయిపేట పంచాయతీ కార్యదర్శి రాణితో కలిసి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు గ్రామంలో పర్యటించారు. పైలట్ గ్రామం హక్కీంపేటలో 31 ఇండ్లు, ఇతర గ్రామాలకు 106 ఇండ్లు మంజూరయ్యాయన్నారు.

## 5న వాహనాల విడిభాగాలు వేలం

మెదక్ అర్బన్, ఏప్రిల్ 29: పోలీస్ వాహనాలకు ఉపయోగించిన విడి భాగాలు టైర్లు, బ్యాటరీలను మే 5వ తేదీన వేలం వేయనున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. మెదక్ టౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన పాత ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు పాల్గొనాలని ఎస్పీ తెలిపారు. సమాచారం కోసం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శైలందర్ 8712657912 సంప్రదించాలని సూచించారు.

## ఫోన్లు పోతే పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలి



బాధితులకు ఫోన్లు అందజేస్తున్న ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్

పాపన్నపేట, ఏప్రిల్ 29: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నా, దొంగలించబడినా బాధితులు వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మంగళవారం పోలీసులు రికవరీ చేసిన 5సెల్ ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ వెబ్‌సెట్ ద్వారా రికవరీ చేశామన్నారు. ఫోన్ల రికవరీలో పాపన్నపేట మండలం ముందంజలో ఉందన్నారు. ఇందుకు కృషి చేసిన ఏఎస్ఐ సంగన్న, కానిస్టేబుల్ దుర్గా ప్రసాద్‌లను అభినందించారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



రామాయంపేట, ఏప్రిల్ 29: కాట్రియాలలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ, సూరారం మల్లారెడ్డి దవాఖాన వైద్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. 260 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందజేశారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, మాజీ సర్పంచ్ శ్యాములు, రాజేందర్‌గుప్త, హెల్త్ క్యాంపు నిర్వాహకుడు రవిశంకర్ పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, ఏప్రిల్ 29: దంతాన్‌పల్లికి చెందిన బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మంగళవారం అందజేశారు. గేడి భూమయ్యకు రూ.60వేలు, కుల్ల నర్సింలుకు రూ.12,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ కన్నారం దుర్గేశ్ తదితరులు ఉన్నారు.

## జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మించాలి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన గొల్పర్తివాసులు

రామాయంపేట, ఏప్రిల్ 29: రామాయంపేట 44వ జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మించాలని పురపాలికలోని గొల్పర్తి గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ నగేశ్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో తమ గ్రామం మీదుగా 44వ జాతీయ రహదారి నిర్మించారని, అప్పుడు నిర్వహించిన సర్వీస్ రోడ్డును మూసివేయాలని హైవే అథారిటీ చూస్తోందని, సర్వీస్ రోడ్డు మూసేస్తే తాము బోరుబావుల వద్దకు వెళ్లాలంటే ఇబ్బందులు తలెత్తుతాయని గ్రామస్తులు తెలిపారు. జాతీయ రహదారి పై జంక్షన్ బైపాస్ వద్ద బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు.

## అనుమతులు లేని పాఠశాలలో అడ్మిషన్లు

వెల్దుర్తి, ఏప్రిల్ 29: ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలకు ఏర్పాటు చేసి అడ్మిషన్లు చేస్తున్నారని యూఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్మిషన్లు జరుగుతున్న విషయం తెలుసుకుని మంగళవారం పాఠశాలకు వెళ్లి అడ్డుకున్నారు. ఇప్పటికే పాఠశాలలో వందలాది అడ్మిషన్లు చేశారని, విద్యాశాఖ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని, కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వినతి



ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన లంబాడీ అరుణ

వెల్దుర్తి, ఏప్రిల్ 29: ఇందిరమ్మ ఇంటిని తనకు మంజూరు చేసి ఆదుకోవాలని మహ్మద్‌నగర్ తండాకు చెందిన లంబాడీ అరుణ విన్నవించుకున్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన ఆమె విన్నవించుకున్నది. కార్యాలయంలో తనను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆమె రోదించింది. విలేకరులు విషయాన్ని అడుగగా తన భర్త మృతి చెందాడని, ఇద్దరు కుమారులతో కలిసి రేకుల ఇంట్లో నివసిస్తున్నానని తెలిపింది. తనకు ఇందిరమ్మ ఇంటిని కేటాయించాలని అధికారులను వేడుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయింది. అధికారులు, ప్రభుత్వం స్పందించిన ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని వేడుకున్నది.

## పేద వధువు పెండ్లికి బియ్యం అందజేత



చేగుంట, ఏప్రిల్ 29: మండలకేంద్రానికి చెందిన గిరికల మాధవి, మహేశ్ కూతురు వివాహం బుధవారం జరుగనుంది. వారి వివాహానికి పేద వధువుకు పెండ్లికి వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అయిత పరంజ్యోతి 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డెరెక్టర్ రఘురాములు, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీశైలం శ్రీనివాస్, హమాలీ సంఘం అధ్యక్షుడు వెంకటేశం, వార్డు మాజీ సభ్యులు పొట్టి సత్తయ్య, సోమరాజు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



మాదకద్రవ్యాల నిర్మూలపై కళాకారుల అవగాహన

రామాయంపేట, ఏప్రిల్ 29: మాదకద్రవ్యాలకు అలవాటుపడి విలువైన ప్రాణాలు పోగొట్టుకోవద్దని తెలంగాణ సాంస్కృతిక కళాకారుల బృందం సభ్యులు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని రాయిలాపూర్‌లో కళాకారులు ఆటపాటలతో పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. పేకాట, జూదం, ఆన్‌లైన్ గేమ్స్, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆటపాటల ద్వారా తెలిపారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న గ్రామ పెద్దలు

రామాయంపేట, ఏప్రిల్ 29: పురపాలికలోని గొల్పర్తికి చెందిన ఎర్రం స్వప్న కార్పొరేట్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, కులపెద్దలు ఎమ్మెల్యే రోహిత్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బాధిత కుటుంబానికి రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గ్రామపెద్దలు అందజేశారు.